# వైటల్ స్టాటిస్టిక్స్

**పట్టు పంచెల సంఖ్య బై పట్టుచీరల సంఖ్య ఈజీక్వల్టు**

**'క్రమ భిన్నమైతే' ఆడవాళ్ళు గొప్ప**

**'అక్రమ భిన్నమైతే' మగవాళ్ళు గొప్ప!**

కుక్కరు చెడిపోతే స్త్రీ నిర్బంధ విద్యావిధానాన్ని దృష్టిలో ఉంచుకుని అత్తెసరు పెట్టి అక్కడే నిలబడ్డాను. ఇదివరకైతే ప్రెషర్ హెడ్ విజిలేస్తూ ఎంచక్కా పిలిచేది. ఇపుడీ తుకతుకలు, పిగిలిపిగిలి ఆగాక నాలుగైదు మెతుకులు పట్టుకుని చూశాను. ఉడికిందోలేదోగానీ చెయ్యి మాత్రం చుర్రుమంది.

''వంటయిందోచ్'' అంటూ వారి రూంలోకి పరుగెత్తాను. వారిమీద ప్రేమకాదు, నాకు దేశమంత ఆకలేసింది.

భోజనాల దగ్గిర కూడా వారేదో ఆలోచిస్తూనే ఉన్నారు. ఇది మా పెళ్ళయిన ఇన్నేళ్ల బాపతు పరధ్యానం. దాన్ని రిసెర్చి అంటార్ట. అది చెయ్యమనిచెప్పే యుజిసికి ఏవో స్కేళ్లుంటాయట.

అన్నట్టు మా వారు అదేదో రూరల్ డెవల్ప్మెంట్... సారీ డెవలప్‌మెంటాఫీసులో డైరెక్టరు. ఆయనగారి డైరెక్షనేవిటో యాక్టర్లెవరో నాకు తెలీదు. వారు కాగితాలమీద పల్లెల బాగోగులు రాస్తుంటారు. అవి ఎలా కుంటుపడ్డాయో, ఎలా గంట్లుపడ్డాయో లెక్కలు కడుతుంటారు. ఈ కట్టడానికి వేరే డైరెక్టర్లుంటారట. వారిని స్టాటస్టికులు అంటార్ట... సారీ... స్టాటస్టిషియనో... అదేవిటో అంటార్ట. దాన్లో కూడా ఏదో డిప్లమో తీసుకున్న మా వారికి చూసిన ప్రతిదీ వెంటనే ఓ ఫార్ములాలాగా కనిపిస్తుంటుంది. మీనూ, మీడియన్నూ, కర్వ్యూ, డీవియేషనూ, బారూ గ్రాఫూ... ఏవేవిటో...మనకి ఎమరాల్డు పచ్చలాంటి చీరల పేర్లులా వాళ్లవి కలవరిస్తుంటారు. మరీ 'బార్' అంటున్నపుడు నాక్కొంచెం ఎబ్బెట్టుగా ఉంటుంది. ఎప్పుడూ ఆ కర్వ్యుల గొడవేగాని ఈ చీర బాగుందే అనిగానీ, ఆ మాటలు నీకు నప్పుతాయని గానీ అంటే ఒట్టున్నర! ఇక కుక్కర్ బాగు చేయించడానికి ఆయనకి తీరికెక్కడ!

''ఫ్రెండ్... ఎలా వండావు కుక్కర్లేకుండా'' అంటూ సెమినారేదో అది అన్నట్టుగా తారసపడ్డాడు. అన్నంమీదికి కాబట్టి సరిపోయింది.

''నేను వండలేదు. అదే ఉడికింది'' అన్నాను ఆవకాయ వడ్డిస్తూ.

''నీ ఫ్రీక్వెన్సీ బాగా లేనట్టుందే'' అన్నాడు అన్నంలో తగిలిన మట్టిబెడ్డ కామోలు... మునివేల్తో తీసి కంచం అంచుకు రాస్తూ. నేను మాట్లాడలేదు.

''కుక్కర్లో ఉడికి ఊరుకుంటుంది సరేలే... ఈ ఇత్తడి తప్పేలలో ఎలా ఉడికిందో తెలుసుకుందామనీ...'' అంటూ సాగదీశాడు మళ్లీ.

నాకు దుఃఖం వచ్చింది. పోయినేడాదే 'ఎన్సీఈఆర్టీ'' వాళ్లకి నాలుగో తరగతి పుస్తకం రాయిస్తుండగా నా పైట చెంగు అందించి బతికాను. ఛఛ! ఆర్నెల్ల నించీ తలంటుకోలేదు. కళ్ళు బెడ్‌రూం బల్బుల్లా, పళ్ళు ఓల్టేజి చాలని ట్యూబ్ లైటులా...''

అన్నం తినేటపుడెందుకులే— ఇది సమయం కాదు అని ఊరుకున్నాను. మన కోర్టు వేరే ఉంది కదా! భోజనాలయ్యాక మళ్లీ స్టడీరూంలోకే దూరాడు.

*** *** ***

ఆయనెప్పుడూ ఇదివేసుకోవెందుకూ అంటూ ఎత్తి చూపించే మాక్సీ వేసుకుందాం అనుకున్నాను. పనులు చకచకా చేసుకోవడానికి మాక్సీలైతేనే బాగుంటుంది. అందుకే ఫ్యాక్టరీ వర్కర్లు పైకీ కిందికీ ఒకటే మాక్సీ ల్లాంటివే వేసుకుంటారు అని ఆయనింకేదో చెప్పబోతుంటే నేనెలా చూసి ఉంటానో మరి... వెంటనే '' నువ్వు సైంటిఫిక్‌గా ఆలోచిస్తే కోపంరాదు. ప్చ్...'' అని అంతటితో ఆ సైన్సు పాఠం ఆపేస్తారు.

ఎంచక్కా చీరైతే లాగడానికి కొంగూ అదీ ఉంటుంది. ఈ మాక్సీలో ఎలా బావుంటానో

...స్తూ చాలాసార్లు వీధి బడికివెళ్తే ఎంతో బావుంటుందని మొహం వేల్లాడేశాడు. ఆ బాపతు మనిషి ఎంత తోమినా పోక ఇంకా ప్రతిదీ ఏదో తెలుసుకుందామనే ధ్యాస. ప్రతిదాంట్లోనూ ఏదో ఉందని అనుకోవడంతో ఈ పిహెచ్‌డీగాళ్ల పేపీ గోచీల పూర్వోత్తరాల దాకా దిగుతాయి.

ఓ ముద్ద మింగాలో లేదో కళ్లటోడు తీసి కళ్ళు తుడుచుకుంటూ ముక్కును చీదడానికి ప్ర

**ఎమ్మెస్సార్ మూర్తి**

నా కర్థంకాదు. నాకైతే అది చూడగానే వేవిళ్ళు, పురుళ్ళు, ఆస్పత్రిలోని కారిడార్లూ, ఆ వాసనలూ, నర్సులూ గుర్తుకొచ్చి ఉలగరింపు మొదలవుతుంది. ఛఛ... ఏం మాక్సీలండీ... నేషనల్ ప్రోగ్రామ్స్‌కీ నెట్‌వర్క్ ప్రోగ్రామ్స్‌కీ... అంటే పెళ్ళి పేరంటాళ్ళు వగైరాలకి మాక్సీలు నప్పుతాయా?

ఓ మాంఛి అయిడియా వచ్చి వెంటనే అమలులో పెట్టేశాను. ఎంతోసేపు పట్టలేదు.

నేరుగా స్టడీరూమ్‌లోకి వెళ్లాను.

ప్చ్. రియాక్షనేగానీ యాక్షన్ తక్కువ.

''ఇంత రాత్రపుడు పేరంటమేముందీ పట్టుచీర ప్లస్ నగల్తో తయారయ్యావ్?'' అన్నాడు.

నేను ఏ పేరంటాన్నీ వదల్ను: అదీ ఈయనగారి బాధ! ఎందుకు వదల్నంటే నాకు ఈయనగారు కొన్న పట్టుచీరల ప్రదర్శనకి కాదు. నాకు సాంప్రదాయపు పాటలంటే... ఎంతో ఇష్టం. ఎందుకంటే అవన్నీ నాకు వచ్చు. అంటే పాడగలను. సమర్తనుండి బారసాలదాకా... (అసలది బారసాల కాదూ బాలసారె అంటే ఎవరూ వినరు. ప్చ్. సాంప్రదాయం బొత్తిగా తెలీదు) నేను లేనిదే ఏ నెట్‌వర్కు ప్రోగ్రామూ జరగదు.

ఆ రత్నావళి పట్టుచీర అంచుల్ని నలక్కుండా కొంచెం ఎత్తిపట్టుకునేప్పుడు చూస్తాడుగదా అనుకున్నాను.

చూశాడు.

''నిన్ననే కదా.. లంగాల్లేవంటూ పాటలు పాడావ్.. కొత్త లంగా ఎప్పుడు కొన్నావేమిటి?'' అన్నాడు. ఛస్... సాంప్రదాయం తెలిస్తే కదా సరసం తెలిసేది అనుకుని ''నేనసలు పట్టుచీర కట్టుకున్నానంటే కొత్త తెల్లలంగా లేందే కట్టుకోనే కట్టుకోను''


''ఓహో'' అలాగా అంటూ ఏదో డిస్కవరీ రాసుకోవడానికి బాల్‌పాయింట్ పెన్‌తో రడీ అయ్యాడు. నేను కుర్చీ వెనగ్గా నిలబడి కాస్తంత వంగానేమో...నా మెళ్ళో నాన్తాడు తన చెంపకి తగిలి ఉలిక్కిపడ్డాడు.

ఫరవాలేదనుకుంటూ నేను ఎదురుగా టేబిల్ మీదకి ఎగిరి కూర్చుని... పట్టుచీర కట్టుకున్నపుడు అలా ఎక్కడ పడితే అక్కడ కూర్చోకూడదు. ఒకవేళ కూర్చున్నా... చాలా జాగ్రత్తగా వెనక పమిట బాగాపైకి వత్తిగిలిగించి కూర్చోవాలి... కానీ ఆ మూడ్‌లో అది ముందుగా గుర్తుకి రాలేదు. వచ్చాక మళ్లీ దిగి అదంతా చేసే ఓపికాలేదు.

కాళ్ళు ఉయ్యాల బల్లమీద ఎక్కి ఊగుతున్నపుడు ఊపినట్టుగా ఊపుతూ అన్నాను సరాదాగా ''ఏవిటండీ ఈ రాతకోతల్స్?''

''ఇదా'' అంటూ సకిలించి ''ఇదో ప్రాబ్లమ్''

''దీన్ని సాల్వ్ చేస్తే ఏమిస్తుందీ?''



అన్నాను.

''నిద్ర'' అన్నాడు కోపంగా.

''ప్లీజ్ నాకూ చెప్పండి'' అంటూ బుంగమూతి పెట్టాను.

ఆయన ''చూడు లవ్‌లీ...'' అనగానే నాకు కోపం ఎప్పటిలాగే వచ్చింది. వెంటనే కాగితాలు లాగేసుకున్నాను. ఆయన మూడ్ నేను చెడగొట్టినప్పుడల్లా నన్ను ''లవ్‌లీ డెవిల్'' అంటుంటారు.

''అదే... అదే... కోపం వద్దు. లవ్‌లీ అన్నానేగానీ ఆ తర్వాత ఏమీ అన్లేదుగదా... దీన్ని కైస్క్వేర్ అంటారు'' ఏదో చూపిస్తూ అన్నాడు.

''కైస్క్వేరా? అంటే?''

''అంటే ఎలా చెప్పాలీ... మనం ఓ నిర్ణయానికి రావడానికి చాలా సమాచారం సేకరిస్తాంగదా! అదంతా స్టాండర్డ్ కర్వ్‌లో పెట్టి ఆ తర్వాత కైస్క్వేర్ టెస్ట్ చేస్తాం. నిర్ణయం వస్తుంది.''

''కర్వ్... స్టాండర్డ్ కర్వ్... ఏవయ్యా మీ స్టాటస్టిక్కుల్లో కూడా వంపులు కనపడితేనే గానీ ప్రాబ్లమ్ సాల్వ్‌కాదా ఏ?''

''అహ్హహ్హ'' అంటూ నవ్వి ''అదంతే. స్టాండర్ట్ కర్వ్‌లో ఆడవాళ్లకి సంబంధించిన కర్వులే ఉండవులే... ఇదుగో చూడు ఇదీ స్టాండర్డ్ కర్వ్'' అంటూ చూపించి ''ఎలా ఉందీ శివలింగంలా లేదూ'' అన్నాడు.

''కాదు. మీరు బుకాయిస్తున్నారు'' అన్నాన్నేను.

''సరే నీ ఖర్మ''

''ఇంతకీ మీరు కనుక్కోబోయే నిర్ణయం ఏమిటీ?''

''అలా అడిగావు బావుంది. ఇలా చూడు. ఏ




దేశంలోనైనా పాపులేషన్ రెండే రకాలు. స్త్రీలు, పురుషులు. వీరిలో నిర్ణయం తీసుకునే శక్తి ఎవరికుంటుంది? ఆ నిర్ణయాలు అమలుపరిచే శక్తి ఎవరికుంటుంది? ఈ రెండు విషయాల దృష్ట్యా మూడోది అంటే వీళ్లలో ఎవరు గొప్ప ?''

నాకు నవ్వాగింది కాదు.

''ఏమిటలా తీసిపారేశావ్''

నేను ఇంకా పగలబడి నవ్వుతూ టేబిల్ దిగి ఆ గదిలో ఉన్న ''సింగిల్ కాట్''నే సర్దడం మొదలెట్టాను.

''అరెరె.. దాన్ని డిస్టర్బ్ చేయవద్దు. ఆ దిండు అలా వదిలెయ్. లేకపోతే ఇలా ఇచ్చెయ్. అది నా చేతికింద లేకపోతే నాకు అయిడియాలు సమంగా రావు''

నేనింకా నవ్వుతూ అదోలా నిలబడి, నా నడుం చుట్టూ కొంగు తిప్పి బొడ్లో దోపి ''మీరిలా మంచంమీదికి రండి'' అన్నాను ఆజ్ఞాపించినట్టు.

''వ్వాట్'' అన్నాడు.

''గాభరా పడకండి. నే కాస్సేపు కుర్చీలో కూర్చోవాలి'' అన్నాను.

వినయంగా లేచి మంచంమీద కూర్చున్నాడు. నేనింకా అక్కడే ఉండి— తనని ఉడికించాలని కాస్త పక్కకి జరగండి'' అన్నాను కూర్చోబోతూ

''యూ చిన్ని డెవిల్ గెటవుట్'' అన్నాడు.

ఆపవయ్యా అన్నట్టు చెయ్యి విదిలిస్తే నా గాజుల గలగలలువిని అదోలా అయిపోయాడు. నేను లేచి కుర్చీలో కూర్చుంటూ.

''సైంటిస్టులకు కావాల్సింది యాక్షన్ రియాక్షన్ కాదు'' అంటూ బాచాపట్లు వేసుకు మరీ కూర్చున్నాను.

గలగలల ప్రభావం ఇంకా పన్చేస్తున్నట్టుగా... ఆ మోకాలికి ఈ మోకాలికీ మధ్య బిగుతైన నా రత్నావళి రంగు చూస్తున్నారు.

పైగా '' చూడు చిన్నీ నువ్విప్పుడసలు ఎలా ఉన్నావో తెలుసా?'' అన్నాడు.

అమ్మయ్య! ఇపుడుకానీ అసలు స్టెప్ రాలేదు. నా రఫ్‌వర్కు సక్సెసయింది.

''నేనెలాగూ ఎవరిలాగోలేనని నాకు తెలుసుకానీ ముందసలు మీ ప్రాబ్లమ్ చెప్పండి''

చప్పబడ్డట్టు అనిపించినా వెంటనే అన్నాడు.

''నీకేం తెలుసు ఈ స్టాటస్టిక్స్. ఇదేమన్నా పాలకూర మజ్జిగపులుసా— కలిపి— తిరగమోత దాని ముఖం మీద కొట్టడానికి..''

''దానిమొఖం మీదేంఖర్మ మీ మొఖం మీద కూడా కొడ్తున్నాను'' అందామనుకుని... ''చెప్పాల్సిందే ప్లీజ్'' అన్నాను.

ఆయన ఉలక లేదు.

''అయితే నేనేదుస్తా'' నన్నాను జోక్‌గానే

''అమ్మో అంత పన్జేయకు. రేపు ఈ రిపోర్టు ఇచ్చెయ్యాలి. నువు ఏదడిగితే అది చెప్తా''

''ఫస్టు— ఈ ఆడవాళ్ల, మగవాళ్ల సైమ్సు గొడవేదో చెప్పండి. నేను మీ స్టూడెంటునే— నాకేమీ రాదు అనుకుని చెప్పండి''

అబ్బ! అప్పుడొచ్చిందండీ అసలు స్పిరిటూ. లేచి లెక్చరర్లా... కాదు ప్రొఫెసర్లా... నాలుగు

వేళ్ళూ కలిసిపోయి ఉన్న అరచేతుల్ని అటూ ఇటూ తిప్పుతూ చెప్తున్నాడు.

"ఆడవాళ్ళు మగవాళ్ళు ఎవరికి ఈ ఇద్దర్లో ఈ సమాజాన్ని శాసించే హక్కుందో తెలుసుకోవాలంటే చాలా ఫాక్టర్స్, సంక్లిష్టు ఉన్నాయి. దీనికో సైంటిఫిక్ ఫార్ములా కనిపెడితే— అది టాప్ రాజకీయాల దగ్గర్నుంచీ— పెట్టీకొట్ల బిజినెస్‌దాకా అప్లై చెయ్యొచ్చు. ఇంతవరకూ జరిగిందేమిటంటే— ఆడవాళ్లకో క్వొశ్చనీరూ అంటే ప్రశ్న పత్రం— మగవాళ్లకో క్వొశ్చనీరూ ఇచ్చాం. వాళ్లు దానిలో నింపి పంపిన సమాచారమే మా డేటా. ఆ డేటాకి ఫ్రీక్వెన్సీ పెట్టి..."

"ఆపండి" అన్నాను.

నేను తలవంచుకునే "మగాళ్ల ప్రశ్నా పత్రంలో మచ్చుకి ఓ కొశ్చెన్ చదవండి" అని అడిగాను.

ఓ పెద్ద కాగితం తీసాడు.

"ఉదాహరణకి 6వ ప్రశ్న చదువుతాను— మీరు నిద్రలేవగానే గుర్తుకొచ్చేది.

1. అమ్మ.
2. నాన్న.
3. భార్య
4. ఆడపిల్లలు
5. మగపిల్లలు
6. చిన్నప్పటి స్నేహితురాలు.
7. న్యూస్ పేపరు.
8. సిగరెట్లు
9. ఇవ్వేమీకాదు

నాకుపొగిలిపొగిలినవ్వొచ్చిందిఈసైంటిస్టుల సైత్యానికి.

"ఇక ఆడవాళ్లకిచ్చే కొశ్చనీర్లో— చివరిది మాత్రం చదవండి చాలు!"

ఇంకో పెద్ద కాగితం తీసి చివరి పేజీ వెతికి "ఆ" అంటూ మొదలెట్టాడు.

"మీరు ఏకాంతంగా ఉన్నపుడు గుర్తుకొచ్చేది?

1. భర్త
2. అమ్మ
3. నాన్న
4. చిన్నప్పటి స్నేహితుడు
5. మగ పిల్లలు
6. ఆడపిల్లలు
7. ఇంట్లో అయిపోయిన వస్తువులు
8. సనిమనిషి—పనిమనిషి లేకపోతేన్యయంగా తోమవలసిన అంట్లకుప్ప
9. అపుడెపుడో పారేసుకుని ఇంకా దొరకని బంగారపు సొమ్ము
10. ఇవ్వేమీ కాదు.

నాకు పొగిలిపొగిలి దుఃఖం వచ్చింది.

"ఇలా ఎంతమంది దగ్గర్నుంచి సేకరించారు?"

"చాలా మంది"

నేను లేచాను. మా వార్ని చూస్తే జాలేసింది. ఈయన్ని మేపుతూ మా అమ్మ నాన్నని ఊరించిన ఆ ఉద్యోగమంటే జాలేసింది.

సెమినార్లు, లాబరేటరీలు, ఆ చెత్తకాగితాలని ఎత్తిరుకుపోయి అట్టలు తయారుచేసే ఫ్యాక్టరీకి అమ్ముకునే లారీ లోడ్లు గుర్తుకొచ్చి దిగులేసింది. 65 పర్సంట్ అజ్ఞానంతో సహా 35 పర్సెంట్ మార్కుల సర్టిఫికెట్ ఇచ్చే యూనివర్శిటీలంటే ఏడుపొచ్చింది. కాలిక్యులస్సూ, ఎకనమిక్సూ, స్టాటిస్టిక్సూ ఇలాంటి హాక్స్ గాళ్ళు నిజానికి ఎందుకింత సమాజానికి దూరంగా ఉంటూ ఆనంద పడిపోతారోనని ఏడుపూ, నవ్వూ రెండూ వచ్చాయి—వీళ్ళు మనవాళ్లే కదా అని ఏడుపూ... ఆ వెర్రి తనానికి నవ్వూ.

"ఏవిటలా మౌనంగా ఉండిపోయావ్?" అన్నాడు.

"నే చెప్తున్నానినండి. ఆడవాళ్ల మాటే చలామణీ అవుతుంది"

"అని నువ్వు అనగా... చిన రావూరు శ్రీమహాలక్ష్మి ఉరఫ్ చిన్ని అంటే కుదర్దు. సైంటిఫిక్‌గా చెప్పగలగాలి. ఎనాలసిస్ ఉండాలి! ఆ".

"సర్లెండి. చెప్తున్నాను. బాగా వినూ. సారీ వినండి" ఈ దేశంలో పోనీ మన రాష్ట్రంలో ఎన్ని కుటుంబాలున్నాయో లిస్టు రాయండి. ప్రతి ఇంట్లో ఎన్ని పట్టుచీరలున్నాయో లెక్క వ్రాయండి. అలాగే ప్రతి ఇంట్లో ఎన్ని పట్టుపరదాలున్నాయో లెక్క రాయండి" మా వారు తెల్లబోవడం గమనిస్తున్నాను. పోవాలి అదే సైన్స్ అంటే!

"ఆ తర్వాత పట్టుపంచెల సంఖ్య బై పట్టుచీరల సంఖ్య ఈజీక్వల్టు "క్రమ భిన్న"మైతే ఆడవాళ్లే గొప్ప.

"అక్రమ భిన్నమైతే" మగవాళ్లు. అంతే! దీనికింత లంబాచౌడా క్వొశ్చనీరక్కర్లేదు. రెండే ప్రశ్నలు. ఇంట్లో ఎంత మంది ఆడవారు కామా, ఎన్ని పట్టుచీరలు? ఎంతమంది మగవారు కామా ఎన్ని పట్టు పంచెలు?" దట్సాల్'

"మరి... కై..."

"ఇక కమ్ లేదూ కుయ్ లేదూ. ఇక మీ డిగ్రీ వేస్టవుతుందనుకుంటే దీన్నే దాన్లో ఎలాగో కిట్టించండి. కానీ ఆన్సరు అనగా 'రిజల్టు" ఒకటే! అంటే సూత్రం కూడా ఒకటే!

"అవును! చాలా గొప్పగా ఉంది. ఇపుడేం చేయాలి!" అంటూ వారు ఊగిపోతున్నారు. మగవాళ్ళు కేవలం రియాక్షనిస్టులు. ఫర్ ఈచ్ యాక్షనుకే కదా ఈక్వల్ అండ్ అపోజిట్ రియాక్షనూ? లైటార్పేశాను.

"ఐయామ్ వెరీ వెరీ హాపీ. నువ్వేంకావాలో కోరుకో డియర్" అంటున్నాడు.

"కొంచెం పక్కకి జరగండి..." ○

